# ఊర్మిళ

లక్ష్మనుని భార్య ఊర్మిళ. సుమిత్రవలె యీమెకూడా గొప్ప గుణవంతురాలు. ఆమెకున్న త్యాగము, ఔదార్యము ఎవ్వరికీ లేవు. అరణ్యానికి వెళ్ళిన తరువాత పదునాలుగు సంవత్సరములపాటు తిరిగి రావటానికి వీలుండదు కదా! కనుక, ఆమెకు ఒకతూరి చెప్పి పోదామని లక్ష్మణుడు వెళ్ళాడు. ఆ సమయంలో ఆమె తన గదిలో కూర్చొని సీతారామ పట్టాభిషేక ఘట్టమును రంగులతో చిత్రిస్తున్నది. ఆమె చిత్రకళలో గొప్ప ప్రావీణ్యం గలిగింది. ఆ చిత్రమును తన తండ్రియైన జనకునికి పంపాలని ఆమె ఉద్దేశ్యం. ఇంతలో లక్ష్మణుడు వెళ్ళి, 'ఊర్మిళా!' కాస్త గట్టిగా పిలిచాడు. ఆమె ఉలిక్కిపడి లేచింది. లేచేటప్పటికి ఆమె ప్రక్కనున్న రంగంతా ఆమె గీసిన చేత్రముపై ఒలికిపోయింది. 'అయ్యో! దానిని చెడగొట్టుకున్నానే' అని బాధ పడింది. అప్పుడు లక్ష్మణుడు, 'ఊర్మిళా! విచారించకు. రామునియొక్క పట్టాభిషేకము కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన పట్టాభిషేక చిత్రమును నీ భర్తయైన లక్ష్మణుడు చెడగొట్టాడు. కాబట్టి నీవు బాధపడనక్కరలేదు' అన్నాడు. జరిగిన సంగతి వివరించి తాను రామసేవ నిమిత్తం వెడుతున్నట్లు చెప్పాడు. ఆమె ఆనందంగా అంగీకరించింది. తనను వదలి వెడుతున్నాడని బాధ పడలేదు. తననుకూడా తీసుకువెళ్ళమని వత్తిడి చేయలేదు.

'నాథా!నిన్ను, నీ సోదరుడైన శత్రుఘ్నుని నా అత్తగారు సేవకోసమే కన్నారు. నీవు రామసేవ చేయటానికే జన్మించావు. శత్రుఘ్నుడు భరతుని సేవ చేయటానికే జన్మించాడు. కాబట్టి, నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు. అయితే నాకొక మాట యివ్వాలి. నీవు అరణ్యంలో ఉండే పదునాలుగు సంవత్సరములు ఒక్క క్షణంకూడా నన్ను తలంచకూడదు. నన్ను తలచుకుంటే సీతారాముల సేవకు అభ్యంతరం కలుగుతుంది. కనుక, నీవు నిరంతరం వారినే స్మరిస్తూ, వారికి ఎలాంటి యిబ్బంది కలగకుండా చూసుకో. ఈ పదునాలుగు సంవత్సరాలూ నన్ను పూర్తిగా మర్చిపో' అని చెప్పింది. ఏ భార్య అయినా ఈరీతిగా చెబుతుందా! ఎవ్వరూ చెప్పరు. ఆమెయొక్క విశాలమైన భావములకు లక్ష్మణుడే కరిగిపోయాడు. 'ఊర్మిళా! నీకింతటి విశాలమైన భావాలున్నాయని నేను అనుకోలేదు. నీ విశాలమైన భావాలను నేను హృదయములో నిల్పుకుంటాను' అన్నాడు. అప్పుడు ఊర్మిళ, 'నా భావాలనుకూడా నీవు తలచ వద్దు. సీతారాములయొక్క విశాలమైన భావములను నీ హృదయంలో నిలుపుకో. వారి ఆజ్ఞను శిరసావహించు. వారికి ఎలాంటి కష్టము కలగకుండా చూసుకో' అని కోరింది. 'నాథా! సీతారాములను సేవించే భాగ్యం నీకు మాత్రమే లభించింది. నీవు చాలా అదృష్టవంతుడవు. ఇంక క్షణమైనా ఆలస్యం చేయకుండా బయలుదేరు' అని చెప్పింది. 'ఊర్మిళా! ఇంక పదునాలుగు సంవత్సరాలు నీవు సీతారాములను దర్శించటానికి వీలుకాదు. కనుక, నీవు ఒకసారి వెళ్ళి సీతామాతను దర్శించుకురా' అని చెప్పాడు లక్ష్మణుడు. కానీ, ఊర్మిళ అక్కడనుండి కదల లేదు. 'నాథా! నీవు సీతారాముల వెంట వెళ్ళటానికి నా వలన యేమైనా అభ్యంతరం కలుగవచ్చు. కనుక, ఆలస్యం చేయక తక్షణం బయలుదేరు. వారి సేవలో పాల్గొను. నీ పవిత్ర సేవలకు అడ్డం రాకుండా ఉండే నిమిత్తం నేను యిక్కడే ఉంటాను' అంది. లక్ష్మణుడు పట్టలేని ఆనందము పొందాడు. 'లోకములో ఇంతటి త్యాగభావం కలిగిన పత్నులుంటారా!' అని ఆశ్చర్యపోయాడు.

యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినపుడు హనుమంతుడు సంజీవని మూలికయున్న పర్వతాన్ని పెకలించి పట్టుకొని ఆకాశ మార్గాన నంది గ్రామం మీదుగా వెడుతున్నాడు. భరతుడు అతనిని చూచి ఎవరో రాక్షసుడని భావించి అంబులు ప్రయోగించాడు. హనుమంతుడు పర్వతంతోబాటు క్రింద పడ్డాడు. భరతునికి నమస్కరించి యుద్ధంలో లక్షణుడు మూర్ఛిల్లినాడని, అతనిని పునర్జీవితుణ్ణిగావించే నిమిత్తము సంజీవని మూలికను తీసుకొని

వెడుతున్నాను' అని చెప్పాడు. భరతుడు హనుమంతుని ఊర్మిళ వద్దకు తీసుకువెళ్ళాడు. హనుమంతుడు ఊర్మిళతో, ' అమ్మా! రాముడు లక్ష్మణుని తన రెండవ శరీరంగా, రెండవ ప్రాణంగా భావిస్తాడు. అలాంటి లక్ష్మణుడు మూర్ఛిల్లటం చేత రాముడు చాలా దుఃఖిస్తున్నాడు' అని చెప్పాడు. అప్పుడు ఊర్మిళ ఫక్కున నవ్వి, 'హనుమంతా! శ్రీరామునియొక్క తత్త్వమును, నా పతియైన లక్ష్మణుని స్వభావము ఈ జగత్తులో ఎవ్వరూ గుర్తించ లేరు. రాముడు సాక్షాత్తు పరమాత్ముడు. అతను విచారించవలసిన అవసరం లేదు. ఇదంతా కేవలం అతని లీలా నాటకమే! ఇంక నా పతియైన లక్ష్మణుని విషయానికి వస్తే అతని శరీరంలో అణువణువులోనూ, కణకణములోనూ రామనామమే నిండియున్నది. కనుక, అతనికెట్టి ప్రమాదము జరగటానికి వీలులేదు. నిజానికి అది మూర్ఛ కాదు. తాను హాయిగా, ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు' అన్నది. ఇంక క్షణమైనా ఆలస్యము చేయక హనుమంతుని బయలుదేరమ'ని చెప్పింది. 'నేను జనకమహారాజు కుమార్తెను. దశరథమహారాజు కోడల్ని, లక్ష్మణుని భార్యను. కనుక, నాకు ఎలాంటి భయము లేదని, భర్తకు ఎట్టి ఆపదా సంభవించదు' అన్నది.

ఊర్మిళ జనకమహారాజుయొక్క స్వంత బిడ్డ. సీత భూమిని దున్నేటప్పుడు దొరికిన బిడ్డ. ఆమె శక్తి స్వరూపిణి. సీత భూజాత కాబట్టి ఆమెలో నూటికి నూరు శాతం అయస్కాంత శక్తి ఉంది. రాముడు పరమాత్మ కాబట్టి అతనిలోకూడా ఆకర్షణ శక్తి సంపూర్ణంగా ఉన్నాది. కనుకనే, జనకుడు సీతను రామునికిచ్చాడు. ఊర్మిళను లక్ష్మణునకిచ్చాడు. లక్ష్మణుడు ఎవరు? ప్రపంచాన్ని మోసే ఆదిశేషుడు. ఊర్మిళ స్వభావం చాలా సున్నితమైనది. పతి అరణ్యానికి వెళ్ళే సమయంలో తాను ఏ గదిలో ఉన్నదో అతను తిరిగి వచ్చేంత వరకు ఆ గదిలోనే ఉంది. ఆమె చిత్రకళయందు ప్రవీణురాలు. తన సమయాన్నంతా చిత్రకళకే వినియోగించింది. దృశ్యకల్పితమైన జగత్తుపై ఆమె ఎలాంటి కోరికలు పెట్టుకోలేదు. సీత పట్టాభిషేకం కోసం పసుపు పచ్చని చీర ధరించింది. ఆ చీరతోనే అరణ్యంలో పదునాలుగు సంవత్సరాలుంది. ఊర్మిళకూడా అంతే. లక్ష్మణుడు తనను వదలి వెళ్ళే సమయంలో ఏ చీర ధరించిందో అతను తిరిగి వచ్చేంతవరకు అదే చీరతో ఉన్నది. దేహభ్రాంతి లేనటువంటివారు జనకుని బిడ్డలు.